సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 15 । ఆగస్టు । 2024



మురిసిన మువ్వన్నెల జెండా

జిల్లా కేంద్రమైన పాడేరులో హర్ ఘర్ తిరంగా సందడి నెలకొంది. దీనిలో భాగంగా స్థానిక అంబేడ్కర్ సెంటర్ వద్ద అధికారులు, విద్యార్థులు నిర్వహించిన జాతీయ జెండాతో ర్యాలీ, మానవహారం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

జనరేటర్ ఉన్నా..



ఈ చిత్రం.. జిల్లా సర్వజన ఆస్పత్రిలోని ఓ బ్లాక్‌లో దృశ్యమిది. కరెంట్ లేకపోవడంతో ఉక్కపోతకు గురై ఆస్పత్రికి వచ్చిన రోగులు, బంధువులు ఇబ్బందులు పడ్డారు. జనరేటర్ ఉన్నా వేయకపోవడం వల్ల ఫ్యాన్లు తిరగ లేదని వారు ఆవేదన వ్యక్తంచేశారు.

సెల్‌లోనే 'ఎక్స్‌రే'



ఈ చిత్రం.. డిజిటల్ ఎక్స్‌రేను సెల్‌ఫోన్‌తో ఫొటో తీసుకున్న రోగి. వైద్య పరీక్షల్లో ఎంతో కీలకమైన ఎక్స్‌రే వివరాలు వెంటనే అందడం లేదు. రిపోర్టులకు మరుసటి రోజు రమ్మనడంతో డిజిటల్ ఎక్స్‌రేను సెల్‌ఫోన్‌తో ఫొటో తీసుకోవాల్సి వస్తోందని రోగులు తెలిపారు.

క్రమపద్ధతి లేక..



ఈ చిత్రం వైద్యపరీక్షల విభాగం వద్ద కనీస వసతులు లేవనడానికి ఈ చిత్రం ప్రత్యక్ష సాక్ష్యం. పరీక్షల కోసం, తమ వివరాలు తెలుసునేందుకు కౌంటర్ వద్ద ఇలా ఇబ్బందులు పడాల్సిందే. కనీసం ఇక్కడ క్రమపద్ధతి అమలు కావడం లేదు.

న్యూస్‌రీల్

రంగురాళ్ల క్వారీ పరిశీలన



రంగురాళ్ల క్వారీని పరిశీలిస్తున్న తహసీల్దార్

చింతపల్లి: మండలంలోని సమ్మగిరి ప్రాంతంలోని రంగురాళ్ల క్వారీని తహసీల్దార్ రామకృష్ణ, పోలీసు సిబ్బందితో కలిసి బుధవారం పరిశీలించారు. గత వారం రోజులుగా ఇక్కడ జరుగుతున్న తవ్వకాలపై ప్రతికల్లో ప్రచురితమైన కథనాలు నేపథ్యంలో ఆయన స్పందించారు. ఆయన రైతులతో సమావేశమయ్యారు. క్వారీలో తవ్వకాలు జరిపితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరు తవ్వకాలకు పాల్పడినా వెంటనే సమాచారం అందించాలని ఆయన సూచించారు. పట్టా భూముల్లో తవ్వకాలు జరిపితే పట్టా రద్దు చేస్తామని హెచ్చరించారు. అక్రమ రంగురాళ్ల తవ్వకాలను ప్రోత్సహించే ఇతర ప్రాంతాల వారి వివరాలు తెలియజేయాలని ఆయన కోరారు.

కుళ్లిన కోడిగుడ్లు సరఫరా



సరఫరా చేసిన కుళ్లిన కోడిగుడ్లు

పాడేరు : మండలంలోని ఇరడాపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు కుళ్లిన కోడి గుడ్లను సరఫరా చేస్తున్నారు. నాణ్యమైన పౌష్టికాహారం అందించే కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఉడికించిన గుడ్లను అందించాల్సి ఉంది. అయితే కాంట్రాక్టర్ వారానికి ఒకసారి గుడ్లను సరఫరా చేస్తున్నారు.ఉడికించిన గుడ్లను పెంకు తీస్తున్నప్పుడు భరించలేని దుర్వాసన వస్తోందని గర్భిణులు, బాలింతలు ఆవేదన వ్యక్తం చేశారు. సూపర్‌వైజర్లు, అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఇలా జరుగుతోందని చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత శాఖ అధికారులు స్పందించి నాణ్యమైన గుడ్లను సరఫరా చేయాలని చేయాలని వారు కోరుతున్నారు. కుళ్లిన కోడిగుడ్ల సరఫరాపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి తెలిపారు.

స్వాతంత్య్ర వేడుకలకు ఆదివాసీలు

- ఢిల్లీ బయలుదేరిన దంపతులు





ఆహ్వానం అందిన అబ్బాయిరెడ్డి, భూన్నమ్మ, శ్రీను, వాణి దంపతులు

వై.రామవరం: మండలంలోని బొడ్డగండి పంచాయతీ మంగంపాడులో ఆదివాసీ పెద్దలైన కొండరెడ్డి కులస్తుడు శరంకోట అబ్బాయిరెడ్డి, సతీమణి భూన్నమ్మ గురువారం ఢిల్లీలో నిర్వహించే స్వాతంత్య్ర దిన వేడుకల్లో పాల్గొననున్నారు. ఈనెల 13న వీరు బయలుదేరినట్టు ఎంపీడీవో కె.బాపన్నదొర తెలిపారు. రాష్ట్రపతి, ప్రధానమంత్రి, కేంద్ర మంత్రుల ఎదుట వీరు ఆదివాసీ సంస్కృతి, కట్టుబాట్లు, ఆచారం, విద్య, వైద్యం తదితర అంశాలపై మాట్లాడనున్నారు.

రాజవొమ్మంగి: మండలకేంద్రం రాజవొమ్మంగికి చెందిన సాగి శ్రీనివాస్, వాణి దంపతులకు ఢిల్లీలో జరిగే స్వాతంత్య్ర దిన వేడుకల్లో పాల్గొనే అవకాశం దక్కింది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఆహ్వానం అందింది. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై వీరి కృషిని అభినందిస్తూ కేంద్ర ప్రభుత్వం ఈ అవకాశం కల్పించింది.

వైద్యమో రామచంద్రా

- పాడేరు సర్వజన జిల్లా ఆస్పత్రిలో అధ్వానంగా సేవలు
- రోగులకు మందుల కొరత
- ఓపీ రిజిస్ట్రేషన్ కోసం బారులు
- సౌకర్యాలు లేక అవస్థలు
- ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శ

ప్రజలకు ఆరోగ్యం పంచాల్సిన జిల్లా సర్వజన ఆస్పత్రి అనారోగ్యం బారిన పడి అవస్థలు పడుతోంది. రెండు నెలల క్రితం వరకు అన్నిరకాల వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి పరిస్థితి అధ్వానంగా మారింది. కనీస సౌకర్యాలు కరువయ్యాయి. మందుల కొరత ఉంది. పూర్తిస్థాయిలో అత్యవసర వైద్యం అందుబాటులో లేకపోవడంతో విశాఖలోని కేజీహెచ్‌కు రిఫర్ చేస్తున్న సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం 'సాక్షి' బృందం పరిశీలనలో అనేక ఆసక్తికరమైన అంశాలు వెలుగు చూశాయి.

గ్రౌండ్ సాక్షి రిపోర్ట్

సాక్షి,పాడేరు/పాడేరు: జిల్లాకేంద్రమైన పాడేరులోని సర్వజన జిల్లా ఆస్పత్రిలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి రద్దీ నెలకొంది. మధ్యాహ్నం రెండు గంటల వరకు ఓపీకి 679 మంది రోగులు వచ్చారు. వైద్యుల గది వద్ద మధ్యాహ్నం రెండు గంటల వరకు రద్దీగానే ఉంది. ఓపీ రిజిస్ట్రేషన్ కోసం బారులు తీరారు. అక్కడ వైద్యుల పరీక్షల అనంతరం ఎక్స్‌రే, స్కానింగ్, రక్తపరీక్షలు విభాగాల వద్ద కూడా రోగులు గంటల తరబడి నిరీక్షించారు. కూర్చునేందుకు పూర్తిస్థాయిలో బెంచీల సౌకర్యం లేక ఇబ్బందులు పడ్డారు. మండలాల ఆస్పత్రుల నుంచి రిఫరల్ కేసులతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడే రోగులు కూడా అధికంగానే వచ్చారు. సాయంత్రానికి వార్డుల్లో ఇన్‌పేషెంట్లు 306 మంది ఉన్నారు.

- ఆస్పత్రిలో మొత్తం వైద్యులు 80 మంది. వీరిలో ఐదుగురు సెలవులో ఉన్నారు. 75 మంది రెండు షిఫ్టుల్లో సేవలందించారు.
- జనరల్ ఓపీలో నలుగురు వైద్యులు ఉన్నప్పటికీ లైన్‌లో నిల్చున్న రోగికి వైద్యపరీక్షలకు సుమారు అరగంట సమయం పట్టింది.
- ఆర్థో, ఈఎన్‌టీ, చిన్నపిల్లలు, చర్మవ్యాధులకు సంబంధించి ఎక్కువ మంది రోగులు వచ్చారు.
- రోగుల సంఖ్యకు తగ్గట్టుగా ఎక్స్‌రే, స్కానింగ్ యూనిట్లు లేవు. ఈ రెండు విభాగాలకు రేడియోలిజిస్టులు లేకపోవడంతో రోగులు రిపోర్టులు కూడా సకాలంలో పొందలేకపోయారు. ఎక్స్‌రే వివరాలను సెల్‌లో ఫొటోలు తీసుకున్న రోగులు రిపోర్టులకు మరుసటి రోజు రమ్మంటున్నారని వాపోయారు. వైద్య పరీక్షలకోసం సుమారు గంటసేపు నిల్చున్నారు.
- పూర్తిస్థాయిలో బెంచీల సౌకర్యం లేకపోవడంతో క్షతగాత్రులు నిల్చొని ఉండాల్సి వచ్చింది.



రోగులతో రద్దీగా ఉన్న పాడేరు సర్వజన జిల్లా ఆస్పత్రి

- మలేరియా, డెంగ్యూ, వైరల్, టైఫాయిడ్‌కు సంబంధించి రోగుల నుంచి రక్తనమూనాలు సేకరిస్తున్నప్పటికీ రిపోర్ట్‌లకు మరుసటి రోజు రావాలని సిబ్బంది చెప్పడం కనిపించింది.
- ల్యాబ్‌ల్లో పూర్తిస్థాయిలో రసాయనాలు లేకపోవడం రక్తపరీక్షలపై ప్రభావం చూపింది. దీంతో కొన్ని పరీక్షలకు విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేయడం కనిపించింది.
- యాంటిబయోటిక్ మందుల కొరత ఉంది. సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి పంపిణీ లేదు. దీంతో అందుబాటులో ఉన్న మందులను రోగులకు ఇవ్వడం కనిపించింది. స్థానికంగా మందుల కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాలేదు.
- రోగులను వీల్‌చైర్, స్ట్రెచర్‌పై తీసుకువెళ్లేందుకు సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో రోగుల బంధువులే ఆ పనులు చేసుకోవాల్సి వచ్చింది.
- ఆస్పత్రి ఇరుకుగా ఉండడంతో పలు విభాగాల్లో వైద్యపరీక్షలకు వెళ్లే రోగులు రద్దీగా ఉన్నప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు వెంటనే జనరేటర్ వేయకపోవడం వల్ల రోగులు ఇబ్బందులు పడ్డారు. చాలా సందర్భాల్లో పరిస్థితి ఇదే విధంగా ఉంటుదని వారు వాపోయారు.
- వార్డుల్లోని రోగులకు రన్నింగ్ వాటర్‌తో పాటు సురక్షిత తాగునీటి సరఫరా విషయంలో ఇబ్బందులు పడటం కనిపించింది. ఈ సమస్యపై అధికారులు దృష్టి పెట్టడం లేదన్న ఆవేదన రోగుల్లో కనిపించింది.

11 పోస్టులు మాత్రమే భర్తీ



పాడేరు జిల్లా సర్వజన ఆస్పత్రి అనుబంధ వైద్య విద్యకు సంబంధించి ఇప్పటివరకు 11 పోస్టులు మాత్రమే భర్తీ చేశాం. 256 పోస్టుల భర్తీకి గత ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్ జారీ చేసినప్పటికి ఎన్నికల కోడ్ కారణంగా పూర్తి స్థాయిలో నియామకాలు జరగలేదు. ఎన్నికలు ముగిసిన తరువాత కూడ డీఎంఏ నుంచి ఎలాంటి అనుమతులు రానందున ఆయా పోస్టుల భర్తీని నిలిపివేశాం.

– డాక్టర్ హేమలత దేవి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్, పాడేరు

రిపోర్టుల ఆలస్యంపై విచారణ చేస్తాం



జిల్లా సర్వజన ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులు ఉన్నారు. సత్వరం వైద్య సేవలందిస్తున్నాం. ఎక్స్‌రే, స్కానింగ్, రక్తపరీక్షల రిపోర్టుల ఆలస్యంపై విచారణ జరుపుతాం. ఆస్పత్రిలోని వార్డు బాయ్‌లు తదితర పోస్టుల భర్తీ లేనందున రోగులకు కాస్త ఇబ్బందులున్నాయి. ఎలాంటి సమస్యలున్నా రోగులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ దృష్టికి తీసుకురావాలి.

– డాక్టర్ విశ్వామిత్ర, సూపరింటెండెంట్, జిల్లా సర్వజన ఆస్పత్రి, పాడేరు.



వైద్యుల గది వద్ద బారులు తీరిన రోగులు

రసాయనాల కొరత



ఈ చిత్రం ఆస్పత్రిలోని రోగులకు పరీక్షలు నిర్వహించే ల్యాబ్. పూర్తిస్థాయిలో రసాయనాలు లేవు. దీంతో వెంటనే పరీక్షలు రోగులకు అందని పరిస్థితి. దీనివల్ల చాలా వైద్య పరీక్షలను విశాఖలోని కేజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నారని రోగులు వాపోతున్నారు.

సౌకర్యాలు మెరుగుపర్చాలి



జిల్లాలోని గిరిజనులకు పెద్ద దిక్కుగా ఉన్న పాడేరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో సౌకర్యాలు మెరుగుపర్చాలి.మా ఏజెన్సీ నుంచే కాకుండా ఒడిశా నుంచి అధిక సంఖ్యలో రోగులు వస్తున్నారు. ఆస్పత్రిలో కూర్చునేందుకు ఎటువంటి సౌకర్యాలు లేవు. కరెంట్ పోయినప్పుడు జనరేటర్ వేయడం లేదు. దీంతో వార్డుల్లో చీకట్లు కమ్ముకుంటున్నాయి. – **ముదిలి త్రినాథ్,** తురాయిమెట్ట, పాడేరు మండలం

లిఫ్ట్ పనిచేయక అవస్థలు



ఆస్పత్రిలో ఒకే వైపున ఎక్స్‌రే, సీటీ స్కాన్ యూనిట్, రక్త పరీక్షల కేంద్రం, కంటి పరీక్షల కేంద్రం ఉండటంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో రోగులను వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం తీసుకువెళ్లాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆస్పత్రిలో లిఫ్ట్ సౌకర్యం ఉన్నప్పటికీ పనిచేయక ఇబ్బందులు పడుతున్నారు. – **కొర్రా బాలరాజు,** బొంజంగి, పాడేరు మండలం

రక్తపరీక్షలకు ఇబ్బందే



మాది పెదబయలు మండలం మారుమూల గిన్నెలకోట పంచాయతీ.అనారోగ్య సమస్యలతో మూడు రోజుల క్రితం పాడేరు ఆస్పత్రిలో చేరా. జ్వరానికి సంబంధించి పరీక్షలు జరిపినప్పటికి మిగిలిన రక్తపరీక్షలు ఇక్కడ లేనందున విశాఖ కేజీహెచ్‌కు వెళ్లమన్నారు. జిల్లా ఆస్పత్రి ఇలా ఉంటే ఎవరికి చెప్పుకోవాలి.

– **బి.లావణ్య,** గిన్నెలకోట

వార్డు బాయ్‌లు లేక..



ఈ చిత్రం రోగులు బంధువుల దుస్థితికి నిదర్శనం. వార్డు బాయ్‌లు లేకపోవడంతో రోగుల బంధువులు ఇబ్బందులు పడుతున్నారు. రోగిని వీల్‌చైర్‌లో వారే ఆస్పత్రిలోకి తరలించాల్సి వస్తోంది.

పేరుకుపోయిన చెత్త



ఈ చిత్రం..ఆస్పత్రి ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్త. ఆస్పత్రి నుంచి మురుగు నీరు పోయేలా డ్రైనేజీ సౌకర్యం లేదు. దీనివల్ల సుంద్రుపుట్టు వద్ద రోడ్డుపైకి వచ్చేస్తోంది. ఇదే ప్రాంతంలో ఆస్పత్రి చెత్త కూడా వేయడం వల్ల దుర్వాసన వస్తోంది.

కేజీహెచ్‌కు రిఫర్



ఈ చిత్రం జిల్లా సర్వజన ఆస్పత్రిలో అత్యవసర వైద్యం అందక రోగుల ఇబ్బందులకు దర్పణం. పాడేరుకు సమీపంలోని తలారిసింగిలో కొమ్ము సురేష్, శాంతి దంపతులకు మూడు నెలల క్రితం మగ శిశువు పుట్టాడు. సోమవారం తెల్లవారుజామున ఫిట్స్ రావడంతో వెంటనే వారు జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఇక్కడ అవసరమైన వైద్యం అందుబాటులో లేకపోవడంతో వైద్యులు కేజీహెచ్‌కు అంబులెన్సులో తరలించారు.

వసతులు లేక..



ఈ చిత్రం ఎక్స్‌రే విభాగం వద్ద రోగుల అవస్థలకు ప్రత్యక్ష సాక్ష్యం. ఇక్కడ కూర్చునేందుకు వీలుగా బెంచీల సౌకర్యం లేదు. దీంతో క్షతగాత్రులు, రోగులు ఎక్స్‌రే తీసే వరకు నిలబడాల్సిందే. ఈ సమయంలో వారు నరకం చూస్తున్నారు.

ఆకట్టుకున్న ఫొటో ప్రదర్శన



ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న జేసీ అభిషేక్ గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్ తదితరులు



ఐటీడీఏలో పంపిణీ చేసిన జాతీయ జెండాలతో ఉద్యోగులు, ఐటీడీఏ పీవీ అభిషేక్

ఆకట్టుకున్న ఫొటో ప్రదర్శన

పాడేరు : స్వాతంత్య్ర సంగ్రామ ఘట్టాలపై పట్టణంలోని యూనియన్ బ్యాంకు అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఫొటో ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంకు మేనేజర్ నాయుడు, యూనియన్ బ్యాంకు అధికారులను వారు అభినందించారు. ఇలావుండగా ఐటీడీఏ సమావేశ మందిరంలో పీవో అభిషేక్ పలువురు అధికారులకు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాలు ఎగరవేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతిఒక్కరూ కూడా తమ ఇంటి ముంగిట జాతీయ జెండాలను ఎగరవేయాలని సూచించారు. ఏపీవో ప్రభాకర్, ఎస్‌డీసీ శర్మ, టీడబ్ల్యూ ఈఈ డీవీఆర్ఎం రాజు, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, ఐటీడీఏ ఏవో హేమలత, డీఆర్‌డీఏ పీడీ మురళి, డీఎల్పీవో కుమార్ పాల్గొన్నారు.

104 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి కేసు వివరాలను వెల్లడిస్తున్న ఏఎస్పీ రాహుల్‌మీనా

చింతూరు: మోతుగూడెం, చింతూరు పోలీసుస్టేషన్ల పరిధిలో రెండు వేర్వేరు సంఘటనల్లో పోలీసులు రూ 5.20 లక్షల విలువైన 104 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఏఎస్పీ రాహుల్‌మీనా బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో వెల్లడించారు. మోతుగూడెం పోలీసుస్టేషన్ పరిధిలో ఆటోలో అక్రమంగా తరలిస్తున్న వంద కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని జీకేవీధి మండలం వలసగడ్డకు చెందిన మజ్జిగెన్ను, కోయిలంగి ధనరాజులను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. వీరికి పైలెట్‌గా వ్యవహరించిన మజ్జి కృపానంద అనేవ్యక్తి పరారైనట్లు చెప్పారు. తెలంగాణలోని ఖమ్మంకు చెందిన కుమార్ అనే వ్యక్తికి ఇచ్చేందుకు వీరు గంజాయిని తీసుకెళుతున్నట్లు ఆయన వివరించారు. చింతూరు పోలీసుస్టేషన్ పరిధిలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా తారసపడిన రెండు ద్విచక్ర వాహనాలను ఆపి తనిఖీచేయగా నాలుగు కిలోల గంజాయి లభ్యమైనట్లు ఏఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న ధ్రుభజ్యోతి కన్వర్, మణేశ్వర్ నార్జారి, గోబిన్ బోనియాలను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ గజేంద్ర కుమార్, మోతుగూడెం ఎస్ఐ గోపాలరావు పాల్గొన్నారు.

దేశభక్తి ఉప్పొంగేలా..

- వాడవాడలా హర్ ఘర్ తిరంగా ర్యాలీలు
- హోరెత్తేలా నినాదాలు
- పాడేరులో భారీ ప్రదర్శన



పాడేరులో నిర్వహించిన ర్యాలీలో జేసీ అభిషేక్ గౌడ్, పీవో అభిషేక్, ఎస్పీ అమిత్ బర్ధర్



పాడేరు పట్టణంలో జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

పాడేరు: జిల్లా కేంద్రమైన పాడేరులో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంలో బుధవారం అధికారులు, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా 900 మీటర్ల అడుగుల జాతీయ జెండాను ప్రదర్శించారు. ఈ ర్యాలీను తలార్‌సింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్ గౌడ్, ఎస్పీ అమిత్‌బర్ధర్, ఐటీడీఏ పీవో అభిషేక్ కలిసి ప్రారంభించారు. అనంతరం మూడు కిలోమీటర్ల మేర ర్యాలీ సాగింది. అనంతరం పాతబస్టాండ్ వద్ద అంబేడ్కర్ సెంటర్‌లో జాతీయ జెండాతో మానవహారంగా ఏర్పడ్డారు. దేశభక్తిని పెంపొందించేలా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూ డీడీ కొండలరావు, డీఈవో బ్రహ్మాజీరావు, డీఆర్‌డీఏ పీడీ మురళి, ఏటీడబ్ల్యూవోలు రజనీ, వెంకటరమణ, సీఐ నవీన్‌కుమార్, ఉపాధ్యాయులు, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో..

చింతూరు: మావోయిస్టు ప్రాబల్య ప్రాంతమైన మండలంలని అల్లిగూడెంలో సీఆర్పీఎఫ్ ఏ-42, జీ-141 బెటాలియన్ల ఆధ్వర్యంలో బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. సీఆర్పీఎఫ్ ఏ-42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ లలిత్, జీ-141 అసిస్టెంట్ కమాండెంట్ చేతన్ ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్ జవాన్లు, గ్రామస్తులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఆర్ఎస్ఐ గణేష్ పాల్గొన్నారు.

పెదబయలు: పెదబయలు సీఆర్పీఎఫ్ కమాండెంట్ రాజేష్ పాండే ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగాలో భాగంగా జాతీయ జెండాతో బైక్ ర్యాలీ,రోడ్ షో నిర్వహించారు. స్థానిక పోలీసు స్టేషన్ నుంచి జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానం వరకు సాగింది. సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ నాయక్ సింగ్, ఇన్‌స్పెక్టర్ స్వామి, పోలీసులు, సెయింటాన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



పెదబయలులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీఆర్పీఎఫ్ పోలీసులు



హర్ ఘర్ తిరంగా రోడ్ షోను నిర్వహిస్తున్న సీఆర్పీఎఫ్ పోలీసులు



చింతూరు మండలం అల్లిగూడెంలో సీఆర్పీఫ్ పోలీసుల ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ

క్లుప్తంగా

గంజాయి నిందితులకు రిమాండ్



పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితులు

పెదబయలు: మండలంలోని కొరవంగి పంచాయతీ అల్లంపుట్టులో ముందస్తు సమాచారం మేరకు నిల్వ ఉంచిన 160 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు జి.మాడుగుల సీఐ రమేష్ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు అల్లంపుట్టులో కార్డెన్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించామన్నారు. గబ్బంగి గున్నయ్య ఇంట్లో నిల్వ ఉంచిన 160 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అతనితోపాటు దీంతో ప్రమేయమున్న ఇదే గ్రామానికి చెందిన గబ్బంగి బాలయ్య దొర, గబ్బంగి తిరుపతిరావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

పాముకాటుతో గిరిజనుడి మృతి



మృతుడు గోవిందరావు

చింతపల్లి: బలపం పంచాయతీ గిగజనప గ్రామానికి చెందిన గోవిందరావు (36) అనే గిరిజనుడు మంగళవారం రాత్రి నిద్రిస్తుండగా పాముకాటుకు గురయ్యాడు. గుర్తించిన కుటుంబీకులు కోరుకొండ పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా జి.మాడుగుల సమీపంలో గోవిందరావు మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

4 తులాల బంగారం చోరీ

రాంబిల్లి (యలమంచిలి): పంచదార్ల గ్రామానికి చెందిన అరుణకుమారి అనే మహిళ ఇంట్లో చోరీ జరిగినట్లు రాంబిల్లి సీఐ నర్సింగరావు బుధవారం సాయంత్రం తెలిపారు. వివరాలివి. పంచదార్ల గ్రామానికి చెందిన అరుణకుమారి ఈనెల 9న తన పుట్టింటికి వెళ్లింది. బుధవారం పుట్టింటి నుంచి వచ్చి చూడగా ఇంట్లో బీరువాను పగలకొట్టి 4 తులాల బంగారం దొంగలు అపహరించినట్టు గుర్తించింది. ఈమేరకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

వరిలో సస్యరక్షణపై సూచనలు



చింతూరులో రైతులకు సూచనలిస్తున్న మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు



చింతపల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న ఏవో శ్రీనివాసరావు



డి.వెలమలకోటలో పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

చింతూరు: వరినారులో వచ్చే ఇనుపధాతు లక్షణాలు, నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కుమ్మూరులో బుధవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. ఇనుపధాతు నివారణకు 20 కిలోల ఫెర్రస్ సల్ఫేట్‌ను బాగా చిలికిన పశువుల ఎరువులో కలిపి చివరి దమ్ములో వేయాలని సూచించారు. దీంతో పాటు లీటరు నీటికి 10 గ్రాముల అన్నభిన, 1 గ్రాము నిమ్మఉప్పును కలిపి ఎకరానికి 200 లీటర్ల మందు ద్రావణం ఏడురోజుల వ్యవధిలో పైరు బాగా తడిచేలా పిచికారీ చేయాలని తెలిపారు.

చింతపల్లి: మండలంలోని కిన్నెర గ్రామంలో మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరల్డ్‌బ్యాంకు ప్రాజెక్టులో భాగంగా అస్సాం వ్యవసాయ విశ్వవిద్యాలయం తయారుచేసిన కిటాకీ జోహా విత్తనాలను తయారుచేసిందన్నారు. గ్రామంలో పలువురు రైతులకు అస్సాం నుంచి తీసుకొచ్చిన ఆయా రకం వరి విత్తనాలను అందజేశామన్నారు. ప్రస్తుతం పలువురు రైతులు ఆయా విత్తనాలతో సాగు చేస్తున్నట్టు చెప్పారు. ఈ రకం సన్న రకమని, ఎగుమతికి అనుకూలమన్నారు. ఈ రకం అన్నం బాస్మతి కంటే ఎక్కువ సువాసన కలిగి ఉంటుందన్నారు. ఇందులో ఎసిటైల్-2, పైరోలిన్-1 జీవ రసాయనం వల్ల సువాసనతపాటు అధిక పంట దిగుబడి ఉంటుందని చెప్పారు. ఈ రకం 135 నుంచి 160 రోజుల్లో పంట వస్తుందని తెలిపారు. గతేడాది పండిన పంట నుంచి సేకరించిన ధాన్యాన్ని పరీక్షలు నిమిత్తం పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రానికి పంపినట్టు చెప్పారు. వరి సాగులో రైతులు సస్యరక్షణ పద్ధతులు పాటించాలన్నారు.

మారేడుమిల్లి : మండలంలోని డి.వెలమల కోట గ్రామంలో వ్యవసాయశాఖ అధికారులు బుధవారం పోలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కంజం నందిని తదితరులు రైతులకు బీజామృతం తయారీ, విత్తనశుద్ధిపై అవగాహన కల్పించారు. రాగి పంటలో ఎక్కువ పోషకాలు ఉన్నాయని, అధిక దిగుబడులు వచ్చే అవకాశాలు ఉన్నాయని రైతులకు వాటి ప్రయోజనలను వివరించారు. ప్రకృతి సాగు వల్ల కలిగే ఉపయోగాలను తెలియజేశారు. ఏవో వెంకటేశ్వర్లు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్య్ర పోరులో మాడుగుల వీరులు



మాడుగులలో చరిత్రకు సాక్ష్యంగా స్వాతంత్ర సమరయోధుల స్థూపం



స్వాతంత్య్ర సమరంలో అల్లూరి, వి.వి.గిరి వంటి ప్రముఖులకు ఆశ్రయమిచ్చిన ఇల్లు ఇదే



భమిటిపాటి చిన యజ్ఞశర్మ (ఫైల్)



పుట్టా అమరయ్యశెట్టి (ఫైల్)

మాడుగుల : నాటి స్వాతంత్య్ర సమరంలో ఢిల్లీ నుండి గల్లీ వరకు ఎందరో మహానుభావులు భారతమాతను దాస్య శృంఖలం నుంచి విముక్తి చేసేందుకు ఎన్నో పోరాటాలు ఎందరో ప్రాణత్యాగాలు చేశారు. ఇంకొందరు కటకటాల వెనుకకు వెళ్లారు. నాటి స్వాతంత్య్ర వీరులకు పలువురికి గుర్తింపు లభించినా ఇంకా ఎందరో తగిన గుర్తింపు మిగిలిపోయారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎందరో స్వాతంత్య్ర పోరాటంలో ఆస్తులు పోగొట్టుకుని, జైలు జీవితాలు అనుభవించి, ప్రభుత్వ గుర్తింపు లేక తుదిశ్వాస విడిచిన వారు కూడా ఉన్నారు. ఇప్పటికైనా వారి వారసులను గుర్తించి తగిన గుర్తింపు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పలువురు గుర్తు చేస్తున్నారు.

మాడుగుల పట్టణానికి చెందిన పుట్టా అమరయ్యశెట్టి, బమిడిపాటి చిన యజ్ఞశర్మ నాడు స్వాతంత్య్ర ఉద్యమంలో పాల్గొని ఉప్పు సత్యాగ్రహంలో అరెస్టయ్యి బరంపురం రాయవేలూరు జైల్లో రెండేళ్లపాటు గడిపారు. అలాగే మాడుగులలో వడ్డాది గోపాల్ భూపతిదేవ్ వర్మ, నానాసాహెబ్, కళ్యాణం ధర్మారావు వంటివారు.. ఉద్యమంలో చేదోడువాదోడుగా ఉండేవారు. అమరయ్యశెట్టి జైలుకు వెళ్లినపుడు విశాఖ జిల్లాలో ఉద్యమం నీరు కారకూడదని, వీరు ఉద్యమాలకు ఊపిరిపోశారు. దేశానికి నాలుగో రాష్ట్రపతిగా పని చేసిన వి.వి.గిరి అప్పట్లో గాంధీజీ ఆదేశాలతో మాడుగుల వచ్చి పుట్టా అమరయ్యశెట్టి ఇంటిలో ఆరుమాసాలు ఉండి ఉద్యమాన్ని సాగించారని చెబుతారు. విప్లవ వీరుడు అల్లూరి కూడా మల్లుదొరతో కలిసి పోరాట సమయంలో మాడుగుల వచ్చి అమరయ్యశెట్టి ఇంట్లోనే ఉద్యమకారులతో చర్చలు జరిపారని చెబుతారు. అమరయ్యశెట్టి వారసులు మాడుగులలో ఈనాటికీ ఉన్నారు.

సమరయోధుల వారసులను ఆదుకోవాలి

స్వాతంత్య్ర పోరాటంలో దేశం కోసం కుటుంబానికి దూరంగా ఉండి ఆస్తులు అమ్మి దేశం కోసం జైలు జీవితాలు గడపడంతో పాటు బ్రిటిష్ ప్రభుత్వం పెట్టిన ఇబ్బందులు గురై చివరకు దేశం కోసం ప్రాణాలు అర్పించిన సమరయోధులకు గుర్తింపు ఇవ్వాలి. అప్పటి కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన వసతి సౌకర్యంతో పాటు, గౌరవ వేతనం అందించాలి

– పుట్టా శ్రీను, రాష్ట్ర స్వాతంత్య్ర సమరయోధుల వారసుల రాష్ట్ర సంఘ సభ్యుడు, మాడుగుల

వివాహితను బ్లాక్‌మెయిల్ చేస్తున్న వ్యక్తి అరెస్ట్

విశాఖ సిటీ: ఇన్‌స్టాగ్రామ్‌లో స్నేహం పేరుతో పరిచయం చేసుకొని.. మాయ మాటలు చెప్పి దగ్గరై.. రహస్యంగా ఫొటోలు, వీడియోలు తీసి వివాహితను బ్లాక్‌మెయిల్ చేస్తున్న వ్యక్తిని సైబర్ క్రైమ్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. నగరానికి చెందిన వివాహితకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఒడిశాకు చెందిన సభ్యాస్మిత్ రౌత్(30) అనే వ్యక్తి నుంచి మెసేజ్ వచ్చింది. ఫ్రెండ్‌షిప్ పేరుతో ఆమెతో కొద్ది రోజులు చాట్ చేశాడు. ఫోన్ నెంబర్ సేకరించి మాయమాటలు చెప్పి ఛాటింగ్, వాయిస్, వీడియో కాల్స్ చేస్తూ దగ్గరయ్యాడు. ఈ క్రమంలో లైంగిక సంబంధం పెట్టుకొని ఆ సమయంలో రహస్యంగా వీడియోలు తీశాడు. కొద్ది రోజులకు అతడి ప్రవర్తన నచ్చక ఆమె దూరం పెట్టింది. దీంతో సదరు వ్యక్తి వీడియోలు, ఫొటోలను కుటుంబ సభ్యులకు పంపించి బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించాడు. దీంతో వివాహిత సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ భవానీప్రసాద్. సాంకేతికత సహాయంతో సభ్యాస్మిత్ రౌత్‌ను గుర్తించి అరెస్టు చేశారు.

రహదారులు జలమయం



కొయ్యూరులో కురుస్తున్న వర్షం

కొయ్యూరు: మండలంలోని బుధవారం మధ్యాహ్నం రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. రహదారులు జలమయమయ్యాయి. కొయ్యూరు, కాకరపాడు, వట్టిగెడ్డ కాలువలు, గెడ్డలు ఉధృతంగా ప్రవహించాయి. కుండపోత వర్షంతో పొలాల్లో వర్షపునీరు భారీగా చేరింది.

రెండు కేసుల్లో 8 మంది అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న క్రైమ్ డీసీపీ వెంకటరత్నం

ఎంవీపీకాలనీ (విశాఖ): ద్వారకా క్రైమ్ జోన్ పరిధిలో ఇటీవల జరిగిన రెండు కేసుల్లో 8 మందిని అరెస్ట్ చేసినట్లు నగర క్రైమ్ డీసీపీ వెంకటరత్నం వెల్లడించారు. ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. ఈ నెల 12న ఎంవీపీ స్టేషన్ పరిధి వెంకోజిపాలెంలో జరిగిన దారి దోపిడీకి సంబంధించి నక్కవానిపాలేనికి చెందిన పిల్లా జయదీప్‌తోపాటు మరో ముగ్గురు మైనర్లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరి నుంచి ఒక సెల్‌ఫోన్, రూ.1,000 నగదు, చోరీ చేసిన ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో జోడుగుళ్లపాలెం వద్ద ఈ నెల 13న జరిగిన దోపిడీలో అదే ప్రాంతానికి చెందిన గద్దిపల్లి సింహాద్రి, తాడి శేఖర్, గాలి సూర్యప్రకాష్, మామిడి ప్రశాంత్‌లను అరెస్ట్ చేసి, ఒక సెల్‌ఫోన్, రూ.500 నగదు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దోపిడీలకు ఆయా యువకులు గంజాయి సేవించడం, చెడు అలవాట్లే ప్రధాన కారణంగా తేలిందన్నారు. గంజాయికి బానిసలైన యువత నేరాలకు పాల్పడుతున్న ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. నగర యువత చెడు అలవాట్లుకు, గంజాయికి దూరంగా ఉండాలని డీసీపీ వెంకటరత్నం కోరారు. నేరాలకు పాల్పడిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామని, రౌడీషీట్లు ఓపెన్ చేసేందుకు వెనుకాడబోమన్నారు. కార్యక్రమంలో క్రైమ్ ఏడీసీపీ మహేష్, జోన్-1 ఏసీపీ వెంకటరావు, క్రైమ్ సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బియ్యం గింజలతో జాతీయ జెండా



మాకవరపాలెం: తూటిపాలకు చెందిన మైక్రో రైటర్ రవికుమార్ హృదయం ఆకారంలో జాతీయ జెండాను రూపొందించాడు. గురువారం స్వాతంత్య్ర దినోత్సవం కావడంతో బియ్యం గింజలతో ఐ లవ్ ఇండియా అని జెండాను తయారు చేశాడు. దీనికిగాను 628 బియ్యం గింజలను వినియోగించానని, వీటిలో 289 ఆరెంజ్, 210 ఆకుపచ్చ, 139 తెలుపు రంగుల బియ్యం గింజలతో హృదయ ఆకారంలో జెండాను తయారు చేసి అందరికీ స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపాడు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థి



సాఫ్ట్‌బాల్ విజేతను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు

నర్సీపట్నం : అంతర జిల్లాల సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం కంప్యూటర్ సైన్స్ చదువుతున్న రావుల సోమేశ్వరరావు సత్తా చాటాడు. విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు అభినందించారు. ఈ నెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు పల్నాడు జిల్లా వినుకొండ గుడ్ షెఫర్డ్ స్కూల్‌లో జరిగిన అంతర్ జిల్లా సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో జిల్లా తరపున సోమేశ్వరరావు పాల్గొని మంచి ప్రతిభ కనబరిచాడు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి, కళాశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

బియ్యం గింజపై జాతీయ జెండా



బియ్యం గింజ మీద జాతీయ జెండా చెక్కిన గోపాల్

మాడుగుల రూరల్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎం.కోడూరు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు నెయ్యిదొండ గోపాల్ తన ప్రతిభను చాటారు. బియ్యం గింజ మీద జాతీయ జెండాను చెక్కారు. ఇందుకు రెండు గంటల సమయం పట్టిందని గోపాల్ బుధవారం తెలిపారు. గతంలో పెన్సిల్ ముల్లు, సుద్ద ముక్కల మీద ఎన్నో సూక్ష్మ కళా రూపాలును చెక్కి తన ప్రతిభను నిరూపించుకున్నారు.

స్వాతంత్య్ర చరిత్రకు చెరగని ఆనవాళ్లు



చోడవరంలో వందేళ్ల నాటి హార్డింజ్ గెస్ట్ హౌస్, ఆవరణలో నాటి జెండా దిమ్మ

- నాడు యూనియన్ జాక్ ఎగిరిన చోటే నేడు మువ్వన్నెల రెపరెపలు
- స్వాతంత్య్ర దినాన్నే జెండా స్థూపం నిర్మాణం



చోడవరం తహసీల్దార్ కార్యాలయంలో 1947 ఆగస్టు 15న నిర్మించిన జెండా దిమ్మ ఇది

చోడవరం : బ్రిటిషు పాలనలో చోడవరానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. హార్డింజ్ అనే బ్రిటిష్ గవర్నర్ చోడవరం కేంద్రంగా చేసుకొని ఈ ప్రాంతంలో పన్నులు వసూలు చేశారు. ఆ బ్రిటిష్ అధికారి విశ్రాంతి తీసుకోవడానికి ఇక్కడ ఆయనకి ఒక గెస్ట్ హౌస్ ఉండేది. అదే చోడవరం హార్డింజ్ గెస్ట్ హౌస్. మరో పక్క స్వాతంత్య్రం వచ్చిన 1947 ఆగస్టు 15వ తేదీన దేశంలో నిర్మించిన అతి కొద్ది జెండా స్థూపాల్లో ఒకటి చోడవరంలో ఉంది. ఎందరో మహనీయుల పోరాట ఫలితంగా దేశానికి స్వాతంత్య్రం సిద్ధించడంతో మువ్వన్నెల జెండాలు దేశ మంతటా రెపరెపలాడించడానికి నాటి యువత ఎంతో ఉరకలేసిందనడానికి ఈ జెండా స్థూపాలు నిలువెత్తు నిదర్శనాలుగా నిలిచాయి. స్వాతంత్య్రం వచ్చి 76 యేళ్లు కావస్తున్నా నాటి జెండా స్థూపాలు అమరవీరుల త్యాగఫలాన్ని నేటి తరానికి గుర్తుచేస్తూనే ఉన్నాయి. దేశానికి స్వాతంత్య్రం వచ్చిందని ప్రకటించిన క్షణమే దేశవ్యాప్తంగా మువ్వన్నెల జెండా ఎగురవేసేందుకు పలు చోట్ల రాత్రికి రాత్రే సంబరాల నడుమ జెండా స్థూపాలను నిర్మించారు. అప్పుడు నిర్మించిన జెండా స్థూపాల్లో చోడవరం తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో నిర్మించిన స్థూపం ఒకటి. ఈ జెండా స్థూపానికి నేటికి 76 యేళ్లు. బ్రిటిషు ప్రభుత్వంలో అప్పటి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన డి.రామదాసు ఈ జెండా స్థూపాన్ని 1947 ఆగస్టు15వ తేదీన నిర్మించి మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. తుప్పుపట్టని మిశ్రమ లోహంతో తయారు చేసిన ఇనుప గొట్టంతో ఈ జెండా దిమ్మను నిర్మించారు. అందుకే ఈ జెండా స్థూపం ఎన్నో దశాబ్దాలు గడిచినా నేటికీ చెక్కు చెదరలేదు. హార్డింజ్ గెస్ట్‌హౌస్ వద్ద బ్రిటిష్ జెండా ఎగిరేందుకు గెస్ట్‌హౌస్ బంగ్లాకు ఎదురుగా ఒక స్థూపం ఉండేది. తెల్లదొరల పాలన అంతమైందని తెలిసిన వెంటనే ఈ స్థూపంపై బ్రిటిషు జెండాను దించి భారతీయ మువ్వన్నెల జెండాను అప్పటి స్థానికులు ఎగురవేశారు. సుమారు వందేళ్ల కిందట నిర్మించిన ఈ స్థూపం ఇప్పటికీ చెక్కుచెదరకుండా నాటి స్వాతంత్య్ర పిపాసకు ఆనవాళ్లుగా ఉన్నాయి. హార్డింజ్ గెస్ట్‌హౌస్‌లో ఇటీవల మహాత్మాగాంధీ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ రెండు చోట్ల ఈనెల 15వతేదీన జెండా వేడుకలు జరిపేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

తైక్వాండోలో 4 బంగారు పతకాలు

- మధురవాడ క్రీడాకారుల ప్రతిభ



అతిథుల చేతుల మీదుగా పతకాలు అందుకుంటున్న క్రీడాకారులు

మధురవాడ(విశాఖ): నగరంలోని మధురవాడకు చెందిన తైక్వాండో క్రీడాకారులు 4 బంగారు పతకాలు సాధించారు. ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11, 12 తేదీల్లో తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో నిర్వహించిన 9వ ఇంటర్ స్టేట్ ఇన్విటేషన్ తైక్వాండో పోటీల్లో మధురవాడ ఆనంద్ తైక్వాండో అండ్ మార్షల్ ఆర్ట్స్ క్లబ్ క్రీడాకారులు విశేష ప్రతిభ చూపారు. క్యాడెట్ 12 నుంచి 14 ఏళ్ల కేటగిరీ 60 కేజీల విభాగంలో పి.వెంకటేష్ బంగారు, 41 కిలోల విభాగంలో ఎస్.కె.హరీష్ రజిత పతకాలు సాధించారు. జూనియర్స్ 15 నుంచి 17 ఏళ్ల కేటగిరీ బాలుర 41 కేజీల విభాగంలో ఎస్.నిఖిల్, 49 కిలోల విభాగంలో పి.దుర్గాప్రసాద్, 55 కిలోల విభాగంలో ఎస్.కె.రజక్, బాలికల 53 కేజీల విభాగంలో పి.సాయిభార్గవి ప్రథమ స్థానాల్లో నిలిచి బంగారు పతకాలు సాధించారు. విజేతలను ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.ఆనందరావు తదితరులు బుధవారం మధురవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో అభినందించారు.

భక్తులకు నిత్యాన్నదానం.. అప్పన్న మహిమ



నిత్యాన్నదాన భవనంలో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం(విశాఖ): శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థాన నిత్యాన్నదాన పథకం 36వ వార్షికోత్సవం బుధవారం సింహగిరిపై ఘనంగా నిర్వహించారు. అన్నప్రసాద భవనంలో సింహాద్రినాథుడి చిత్రపటం వద్ద దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి హారతులు సమర్పించారు. భక్తులకు నిత్యం అందించే ఆహార పదార్థాలతోపాటు ప్రత్యేకంగా తయారు చేసిన చక్కెరపొంగలి, బూరి, పులిహోర ప్రసాదాన్ని అందజేశారు. ఈవో దంపతులు భక్తులకు స్వయంగా వడ్డించారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, ఈఈ శ్రీనివాసరాజు, ఏఈవోలు ఆనంద్‌కుమార్, పాలూరి నరసింగరావు, సూపరింటిండెంట్లు సునీల్, పిల్లా శ్రీనివాసరావు, ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, సిబ్బంది కాశి, హరి, పీఆర్వో నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విరాళాల డిజిటల్ చెల్లింపులకు చర్యలు..

అప్పన్న మహిమ, దాతలు అందిస్తున్న విరాళాలు, సహకారంతో నిత్యాన్నదాన పథకం దినదినాభివృద్ధి చెందుతోందని ఈవో శ్రీనివాసమూర్తి తెలిపారు. సింహాచలానికి వచ్చే భక్తులందరికీ అన్నప్రసాదం అందేలా చేస్తున్నామన్నారు. అన్నప్రసాద భవనంలోని రెండు అంతస్తుల్లోనూ ట్రిప్పునకు సుమారు 600 మంది వరకు అన్నప్రసాదాన్ని అందించేలా ప్రణాళిక చేశామని, త్వరలోనే కార్యరూపం దాలుస్తుందన్నారు. అన్నప్రసాద భవనం వద్ద భక్తులు విరాళాలను డిజిటల్ రూపంలో ఫోన్‌పే, గూగుల్ పే, క్యూఆర్ కోడ్‌ల ద్వారా చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దాతలకు కూడా ప్రత్యేకంగా డోనార్ కార్డులు జారీ చేస్తున్నామన్నారు. మహారాజపోషకులు, రాజపోషకులకు స్వామివారి దర్శనాల్లో ప్రాధాన్యం కల్పిస్తున్నట్టు ఈవో చెప్పారు.

20న ప్రాంగణ ఎంపికలు

మురళీనగర్(విశాఖ): కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇన్‌స్టిట్యూట్ (గైస్)లో ఆటో లివ్ కంపెనీ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ డిప్లొమా విద్యార్థులకు ఈ నెల 20న క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆటో మొబైల్ రంగానికి చెందిన వివిధ పరికరాలు, వస్తువుల తయారీ రంగంలో పేరుగాంచిన ఈ కంపెనీ డిప్లొమా ట్రైనీల ఎంపిక ప్రక్రియ ఆరోజు 9.30 గంటలకు నిర్వహిస్తామన్నారు. పాలిటెక్నిక్ డిప్లొమా మెకానికల్, ఆటోమొబైల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగాలకు చెందిన 2022, 2023, 2024 పాస్‌అవుట్ విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. విద్యార్థులు వారి అప్‌డేటెడ్ రెజ్యూమేతోపాటు సర్టిఫికెట్లు తీసుకు రావాల్సి ఉంటుంది. వీరికి ప్రాథమికంగా రూ.2.36 లక్షల వార్షిక ప్యాకేజీ ఇస్తారు. ఎంపికైన వారు ఆ సంస్థకు చెందిన కాంచీపురం, చెన్నై క్యాంపస్‌లో పనిచేయాల్సి ఉంటుంది.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మురళీనగర్(విశాఖ): కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలోని స్కిల్ హబ్‌లో యువతీ యువకులకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సుకు పదో తరగతి ఆపై విద్యార్హతలు కలిగిన యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. హ్యాండ్ ఎంబ్రాయిడరీ(మగ్గం వర్క్)లో చేరడానికి కనీసం 8వ తరగతి విద్యార్హత కలిగిన మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కోర్సుల్లో చేరడానికి 45 ఏళ్ల వయోపరిమితి నిబంధన ఉందన్నారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సు 6 నెలలు, హ్యాండ్ ఎంబ్రాయిడరీ(మగ్గం వర్క్) కోర్సులో 3 నెలలు శిక్షణ ఉంటుందని చెప్పారు. ఈ నెల 20 నుంచి తరగతులు ప్రారంభిస్తామని, ఆసక్తి గల వారు స్కిల్ హబ్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. వివరాలకు 72870 69457 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.